క్లుప్తంగా

సేవలు విస్తరించాలి

నంద్యాల(వ్యవసాయం): రోటరీ క్లబ్ సేవలను మరింత విస్తరించి సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని రోటరీ గవర్నర్ కల్లూరి రామలింగారెడ్డి, శ్రీరామ్మూర్తి తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో రోటరీ క్లబ్ నూతన సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. అధ్యక్షుడిగా దండె దస్తగిరి, కార్యదర్శి సురేంద్ర, ఉపాధ్యక్షులుగా ఎన్‌సీ మోహన్‌రెడ్డి, విశ్వనాథ్, సహాయ కార్యదర్శులుగా ప్రసాదరెడ్డి, కోశాధికారిగా బాలకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు.

బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): నందిపైప్స్ బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ పోటీలను నందిగ్రూప్ ఆఫ్ కంపెనీ అధినేత సుజల, రామకృష్ణ విద్యాసంస్థల డైరెక్టర్ హేమంత్‌కుమార్‌రెడ్డి, ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.వంశీధర్ ప్రారంభించారు.

విద్యుత్ సమస్యలు తలెత్తనీయొద్దు

గోస్పాడు: గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ఏఈ జ్ఞానసూర్యుడు సూచించారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడా విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు.వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని చెప్పారు. అలాగే విద్యుత్ బిల్లులు సకాలంలో వసూలు చేయాలని ఆదేశించారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తిస్తున్నాం

నంద్యాల(రూరల్): నంద్యాల జిల్లాలో కుష్టు వ్యాధి గ్రాస్తులను గుర్తించి వారికి వైద్యం అందిస్తున్నామని జిల్లా కుష్టు వ్యాధి నిరోధక (నిర్ధారణ) వైద్యులు ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని అయ్యలూరు గ్రామంలో గ్రామ సీఎస్‌ఓలు సింధూరి, మహేశ్వరి ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నివారణపై అయన ప్రజలకు అవగాహన కల్పించారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(వ్యవసాయం): 2023–24 నంద్యాల లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం శుక్రవారం బాలాజీ కల్యాణ మండపంలో రాష్ట్ర మాజీ చైర్మన్ ఏవీ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా పీవీ సుధాకర్‌రెడ్డి, కార్యదర్శిగా సోమేసుల నాగరాజు, కోశాధికారిగా మామిళ్ల నాగరాజును ఎన్నుకున్నారు.

సారా విక్రేత అరెస్ట్

శిరివెళ్ల: మండల కేంద్రానికి చెందిన సారా విక్రేత దినేష్ చంద్రను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. శుక్రవారం సాయిబాబా గుడి సమీపంలో సారా అమ్ముతుండగా దాడి చేసి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని ఆళ్లగడ్డ కోర్టులో హాజరు పరిచామని చెప్పారు.

గంగ జాతర ప్రారంభం

దొర్నిపాడు: రామచంద్రాపురం గ్రామంలో శుక్రవారం గంగ జాతర (ఆవుల పబ్బము)ను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. మొదటి రోజు గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి, రథం ముగ్గు వేయడంతో పాటు ఒంటి కొమ్ము బొల్లేవు గ్రామోత్సవం చేపట్టారు.

కౌలు కార్డులు పొందాలి



జాబితాను పరిశీలిస్తున్న డీఏఓ మోహన్‌రావు

ఆళ్లగడ్డ: అర్హులైన ప్రతి సాగుదారుడు కౌలు కార్డు పొందాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని చిన్నకందుకూరు గ్రామ ఆర్బీకేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్బీకేలో నిల్వ ఉన్న ఎరువులు, విత్తనాలను, రికార్డులను పరిశీలించారు. ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, ఏఓ కిశోర్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

రీసర్వే వేగవంతం చేయాలి



సిద్ధార్థజైన్‌కు వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

నంద్యాల (సెంట్రల్): నంద్యాల జిల్లాలో భూముల రీసర్వేను వేగవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి కోరారు. శుక్రవారం విజయవాడలో సర్వే సెటిల్‌మెంట్, భూరి కార్డుల కమిషనర్ సిద్ధార్థజైన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

కృష్ణ జింక మృతి

రుద్రవరం: మండలంలోని మాచినేనిపల్లె చెరువులో కృష్ణజింక మృతి చెందింది. కొందరు రైతులు చెరువు పక్కనే ఉన్న పొలాల్లో వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా వారు చెరువులో మృతి చెందిన క్రిష్ణ జింకను గుర్తించి రేంజ్ అధికారి శ్రీపతి నాయుడికి సమాచారం అందించారు. రుద్రవరం సెక్షన్ అధికారి నాగరాజు, ఎఫ్‌బీఓలు నరసింహారెడ్డి, సురేంద్ర అక్కడికి వెళ్లి కృష్ణజింక కళేబరాన్ని పరిశీలించారు. రేంజర్ మాట్లాడుతూ చెరువులో దాహం తీర్చుకునేందుకు వచ్చిన జింకపై కుక్కలు దాడి చేసి చంపినట్లుగా తెలిసిందన్నారు.

పెద్దపులి సంచారం

రుద్రవరం: నల్లమల అటవీ ప్రాంతానికి సమీపంలోనున్న పొలాల్లో పెద్దపులి తరచూ సంచరిస్తుండంతో రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. మండల కేంద్రంతో పాటు అప్పనపల్లె, కోటకొండ గ్రామాల సమీప పొలాల్లో పులి సంచరించినట్లు అటవీ అధికారులు పాదముద్రలను గుర్తించారు. శుక్రవారం రుద్రవరం సమీపంలోనున్న గుమ్మకొండ ఉసేనయ్య దర్గావైపు పులి వెళ్తుండటాన్ని రైతులు గుర్తించారు. వారి నుంచి సమాచారం అందుకున్న రేంజర్ శ్రీపతి నాయుడు సిబ్బందితో వెళ్లి పాదముద్రలను పరిశీలించారు. ఆహార అన్వేషణలో భాగంగా అటవీ ప్రాంతలో నుంచి పెద్దపుల్లి బటకు వచ్చి తిరిగి లోపలికి వెళ్లినట్లు పాదముద్రలు ఉన్నాయని రేంజర్ తెలిపారు.

ప్రతి గడపలో సంక్షేమ వెలుగులు



లబ్ధి పొందిన వారికి పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- ఆర్.కృష్ణాపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'
- టీడీపీకి ఓటు వేసినా పథకాలు అందజేస్తున్నారని గ్రామస్తుల వెల్లడి

ఆళ్లగడ్డ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పేదల ఇళ్లల్లో వెలుగులు నిండాయని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అర్.కృష్ణాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలువురు మాట్లాడుతూ తాము టీడీపీకి ఓటు వేసినప్పటికీ పథకాలు అందజేస్తున్నారని, తమకు ఈ నాలుగేళ్లల్లో రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందని సంతోషంగా చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, మండల, క్షేత్ర స్థాయి అధికారులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందజేసిన పథకాలు, చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో నివాస గృహాలు 620 ఉండగా 590 ఇళ్లకు సంక్షేమ పథకాలు అందాయని చెప్పారు. అంతకు ముందు గ్రామానికి చేరిన ఆయనకు స్థానిక నాయకులు, ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది. సర్పంచ్ సుభద్ర, ఎంపీటీసీ లక్ష్మిదేవి, నాయకులు రామకృష్ణారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, రంగారెడ్డి, అశోక్‌రెడ్డి, యల్లయ్య ఉన్నారు.

పేదలకు రక్ష.. 'జగనన్న సురక్ష'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమం పేదవారికి రక్షగా నిలుస్తుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం అట్టహాసంగా చేపడతామన్నారు. అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధుల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సచివాలయాల పరిధిలో ప్రజలకు అందుతున్న 11 రకాల సేవలకు సర్వీస్ చార్జీలు లేకుండా ఇంటి దగ్గరకే వచ్చి ధ్రువ పత్రాలు అందజేస్తారని చెప్పారు. నియోజకవర్గంలో రుద్రవరం మండలం కోటకొండ, శిరివెళ్ల మహదేవపురం, ఆళ్లగడ్డ మండలంలో అహోబిలం, దొర్నిపాడు మండలం గుండుపాపల, ఆళ్లగడ్డ పట్టణంలో జరిగే కార్యక్రమాల్లో తాను పాల్గొంటానని తెలిపారు. నియోజకవర్గ పరిశీలకకుడు నరసింహారెడ్డి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, కూలూరు నరసింహారెడ్డి పాల్గొన్నారు.





జగజ్జననీ మాతకు, శ్రీకాళికాంబదేవికి సారె తీసుకొస్తున్న భక్తులు

అమ్మవార్లకు సారె సమర్పణ

నంద్యాల(వ్యవసాయం):పట్టణంలోని జగజ్జననీ మాత, శ్రీకాళికాంబదేవికి ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో చీర, సారె సమర్పించారు. కాళికాంబదేవికి ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం విజయ్‌కుమార్ దంపతులు ఇంటి నుంచి 108 రకాల పిండి వంటకాలు తెచ్చి అమ్మవారికి చీర, సారె సమర్పించారు. రాత్రి అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించారు. అలాగే జగజ్జననీ మాతకు శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మేళతాళాలు, అమ్మవారి ప్రతిమలతో సారెను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు.

నేడు జగనన్న సురక్ష కార్యక్రమం

నంద్యాల(రూరల్): మండలంలోని కానాల-01, చాపిరేవుల గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణ శ్రీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులుగా తహసీల్దార్ శ్రీనివాసులు, ఈఓఆర్‌డీ మహేందర్‌రెడ్డి, ఆర్‌ఐ యుగంధర్‌రెడ్డితో పాటు మండల పరిషత్, రెవెన్యూ సిబ్బంది పాల్గొంటారన్నారు.సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని ఆదేశించారు.

జూలేపల్లెలో..

గోస్పాడు: మండలంలోని జూలేపల్లె గ్రామంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కుల, ఆదాయ, జనన, మరణ, సీసీఆర్సీ కార్డులు, రేషన్ కార్డు డివిజన్, హౌస్‌హోల్డ్ డివిజన్ తదితర 11 రకాల ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల(సిటీ): పట్టణంలో శనివారం ప్రతిష్టాత్మకంగా ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు తెలిపారు. శుక్రవారం స్థానిక 15వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమం ఆవశ్యకతను స్థానికులకు వివరించారు. వార్డు ఇంచార్జ్ సన్నాల సాయిరాంరెడ్డి, మున్సిపల్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

చాగలమర్రి: మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన వీఆర్‌ఏ కసినేని సంజన్న (59) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సుభద్రమ్మ, వీఆర్‌ఓలు వెంకటరామిరెడ్డి, పద్మశేఖర్, వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ గఫార్ గ్రామానికి వెళ్లి సంజన్న అంత్యక్రియలకు ప్రభుత్వ తక్షణ సాయం కింద అందజేసిన రూ.25వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు.

నేడు ఎమ్మెల్యే రాక

ఉయ్యాలవాడ : మండలంలోని తుడుమలదిన్నె గ్రామానికి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి శనివారం రానున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఎమ్మెల్యే హాజరవుతారని చెప్పారు.

రుద్రవరం: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి శనివారం హాజరవుతారని కోటకొండ సర్పంచ్ వెంకటేష్ శుక్రవారం తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

హక్కులను తెలుసుకోవాలి

గోస్పాడు: ప్రతి ఒక్కరూ తమ హక్కుల గురించి తెలుసుకోవాలని దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ముపాలెం శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని జిల్లెల్ల గ్రామంలో సివిల్ రైట్స్ డే సదస్సు ఏపీడీఎస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రారావు, ఈఓఆర్‌డీ అనసూయ పాల్గొన్నారు.


వైభవంగా శోభాయాత్ర

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ఎన్‌జీ రోడ్డులోని వెలసిన శ్రీషిర్డిసాయిబాబా ఉత్సవమూర్తిని గురుపౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం సాయిబాబా శోభాయాత్రను షిర్డిసాయిబాబా సేవా సమితి సభ్యులు వైభవంగా నిర్వహించారు.

వక్ఫ్ భూముల్లో ఆక్రమణల తొలగింపు

నంద్యాల(సిటీ): వక్ఫ్‌బోర్డు స్థలాల్లో నిర్మించిన ఆక్రమ కట్టడాలపై అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణ పరిధిలోని సర్వే నంబర్ 231లోని 3.89 సెంట్ల వక్ఫ్‌బోర్డుకు సంబంధించి ఇనాం భూమి ఉంది. ఇందులో అక్రమ నిర్మాణాలను చేపట్టగా పలుమార్లు టౌన్ ప్లానింగ్ అధికారులు హెచ్చరించారు. గురువారం సాయంత్రం నిర్మాణాలపై మున్సిపల్ టౌన్‌ప్లానింగ్, సచివాలయ ప్లానింగ్ సిబ్బంది నిర్మాణాలను అడ్డుకున్నా అదే రోజు రాత్రి అనధికారికంగా శ్లాబులు పూర్తి చేశారు. శుక్రవారం ఈ విషయంపై కౌన్సిల్‌లో జరిగిన చర్చపై స్పందించిన జిల్లా కలెక్టర్ అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. వక్ఫ్‌బోర్డు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కట్టడాలను కూల్చివేశారు.

భూ రీసర్వేలో చాగలమర్రికి జిల్లాలో ప్రథమ స్థానం



మాట్లాడుతున్న నంద్యాల ఆర్‌డీఓ ఎ.శ్రీనివాస్

చాగలమర్రి: జగనన్న భూ రీసర్వే కార్యక్రమంలో చాగలమర్రి మండలం జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉందని నంద్యాల ఆర్‌డీఓ, ఆళ్లగడ్డ ప్రత్యేక అధికారి ఎ.శ్రీనివాస్ తెలిపారు. నియోజకవర్గంలో మొత్త 96 రెవెన్యూ గ్రామాల్లో భు రీసర్వే నిర్వహించాల్సి ఉండగా ఇప్పటి వరకు మండలంలో చాగలమర్రి, మల్లెవేముల, చిన్నవంగలి, పెద్దవంగలి, డి.వనిపెంట, ముత్యాలపాడు గ్రామాల్లో డీటీ విజయ్ కుమార్ చొరవతో రీ సర్వే పూర్తి చేసి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. అలాగే ఆళ్లగడ్డ మండలంలోని అహోబిలం, మిట్టపలకల్లె, బాచుపల్లె, రుద్రవరం మండలంలో టి.లింగందిన్నె, శ్రీరంగాపురం గ్రామాలతో పాటు అళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలో 16 గ్రామాలు ఇప్పటి వరకు భూ రీసర్వే పూర్తయ్యిందని, జూలై నాటికి మొదటి విడతలో 48 గ్రామాలు పూర్తి చేస్తామన్నారు. మిగిలిన 48 గ్రామాల్లో రెండవ విడత ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. శనివారం నుండి ప్రారంభం కానునున్న జగనన్న సురక్ష కార్యత్రామ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని తహసీల్దారు సుభద్రమ్మ, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఈఓపీఆర్‌డీ సుదర్శనరావుకు సూచించారు.

వక్ఫ్ ఆస్తులను పరిరక్షించేది వైఎస్సార్‌సీపీనే

- జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- మున్సిపల్ ఛైర్‌పర్సన్ షేక్ మాబున్నీసా



మాట్లాడుతున్న ఛైర్ పర్సన్ మాబున్నీసా

నంద్యాల(సిటీ): పట్టణంలోనున్న ఉన్న వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షించే బాధ్యత వైఎస్సార్‌సీపీదేనని మున్సిపల్ ఛైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాలోని 21 అంశాలకు గాను 2 అంశాలు మినహా మిగిలిన వాటికి సభ్యులు ఆమోదం తెలిపారు. ముందుగా అజెండాలోని 5వ అంశంలోని కాంట్రాక్టర్ అనుమతులు రద్దు చేస్తూ తీర్మానించింది. వర్క్ ఆర్డర్ పొందిన కాంట్రాక్టర్లు నిర్ణీత గడువులోగా పనులు పూర్తిచేయకపోతే బ్లాక్ లిస్టులో పెట్టాలని కౌన్సిలర్ కృష్ణమోహన్ అధికారులను కోరారు. అజెండాలోని 15, 16 అంశాలైన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లకు సంబంధించి దుకాణాల అద్దెలను నిర్ణయించేందుకు సాల్వెన్సీ లేని వారికి మళ్లీ దుకాణాలు కట్టబెట్టడం సరికాదని దేశం సులోచన,కో ఆప్షన్ సభ్యులు పడకండ్ల సుబ్రహ్మణ్యం కోరారు. జీఓ ఎంఎస్ నంబర్ 56-2011 ప్రకారం మున్సిపల్ దుకాణాలు వేలం వేసే ముందు తప్పనిసరిగా సాల్వెన్సీ పత్రాన్ని మున్సిపాలిటీకి సమర్పించాలన్నారు. ఈ కారణంతో ఈ రెండు అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలుపలేదు.అనంతరం ఛైర్ పర్సన్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం నుంచి పట్టణంలో మొదలవుతుందన్నారు. పలు దఫా ల్లో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కౌన్సిలర్లు, అధికారులకు పిలుపునిచ్చారు.

వక్ఫ్ స్థలాల్లో అక్రమ కట్టడాలపై రగడ..

పట్టణంలోని వక్ఫ్ స్థలాల్లో అక్రమ నిర్మాణాలపై వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకుల మధ్య మాటల యుద్ధం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు వక్ఫ్ ఆస్తులను కాజేసేందుకు నకిలీ పత్రాలను సృష్టించారన్నా రు కౌన్సిలర్ ఆరిఫ్ అన్నారు. వారి హ యాంలోనే వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం జరిగాయన్నారు. బాలాజీ కాంప్లెక్స్‌లోని వక్ఫ్ స్థలంలో మదరసా నిర్వహించేందుకు నకిలీ లీజు పత్రాలను తయారు చేసి ఇక్రా పాఠశాలను నడిపారని గుర్తు చేశారు. హైకోర్టు ఉత్తర్వులతో ఆ స్థలాన్ని వక్ఫ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారన్నారు. గత ప్రభుత్వమే వక్ఫ్ స్థలాల్లో నిర్మాణాలు సాగుతున్నా పట్టించుకోలేదని విమర్శించారు. వక్ఫ్ ఆస్తులను పరిరక్షించేందుకు తమ పార్టీ చిత్తశుద్ధితో ఉందని, రూ.10 లక్షలతో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి వక్ఫ్ స్థలానికి కంచె ఏర్పాటు చేశారని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి బదులిస్తూ పట్టణంలో అక్రమంగా నిర్మిస్తున్న 59 కట్టడాలను గుర్తించామన్నారు. వాటికి సంబంధించి చార్జ్‌షీట్‌లు దాఖలు చేశామన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు మున్సిపల్ ఇంజనీర్ రమణ మూర్తి, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంశావలి, డీఈఈలు జయభారతరెడ్డి, మధుకుమార్, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి సమావేశం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లాస్థాయి సమావేశం శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని సీపీఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వాసు, శివయ్య,గౌరవాధ్యక్షుడు బాల ఓబయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి

చాగలమర్రి: మండలంలో శనివారం నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మహబూబ్ దౌలా తెలిపారు. శుక్రవారం తహసీల్దారు సుభద్రమ్మ, ఈఓ. పీఆర్‌డీ సుదర్శనరావుతో కలిసి 1వ సచివాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.

పంటల బీమా మంజూరు

దొర్నిపాడు: భారీ వర్షాలకు పత్తిపంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పంటల బీమా మంజూరు చేసిందని మండల వ్యవసాయాధికారి సునీత శుక్రవారం తెలిపారు. మండలంలో పత్తి సాగుచేసి నష్టపోయిన 881 మంది రైతులకు రూ.2.90 కోట్లు విడుదలైనట్లు చెప్పారు.

సర్వే పరిశీలన

గుండుపాపల, రామచంద్రాపురం, బుర్రారెడ్డిపల్లె గ్రామాల్లో జరుగుతున్న జనన్న సురక్ష సర్వే పనులను ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, టాస్క్ ఫోర్స్ టీం డీఎల్‌డీఓ జనార్ధనరావు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, ఎంపీడీ సుబ్బారెడ్డి పరిశీలించారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం గుండుపాపల గ్రామంలో ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి తెలిపారు.